పేరుకుపోతున్న చెత్తకుప్పలు

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఎటు చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో ప్రధాన కూడళ్లు, చౌరస్తాల్లో చెత్తకుప్పలే కన్పిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని సలీంనగర్ పార్కు వద్ద, స్వామి వివేకానంద స్కూల్ చౌరస్తా, శాలివాహననగర్ తదితర ప్రాంతాల్లో భారీగా పేరుకుపోయాయ. కుళ్లిన ఆహార పదార్థాలు, వ్యర్థాలతో ఈగలు, దోమలు, క్రిమికీటకాలు పెరిగి రోగాలబారిన పడుతున్నామని ఆయా కాలనీల వాసులు వాపోతున్నారు. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణే లక్ష్యం

మలక్‌పేట: మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ (ఎమ్మార్పీఎస్ టీజీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా మలక్‌పేట నియోజకవర్గం మూసారంబాగ్ డివిజన్‌కు చెందిన కలకోట్ల రమేష్‌మాదిగ నియమితులయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టిపాక ప్రభాకర్ మాదిగ జారీ చేసిన నియామక ఉత్తర్వులను మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి మాదిగ చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా రమేష్‌మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పని చేస్తానని, డివిజన్, మండల స్థాయి కమిటీలను నియమించి ఎమ్మార్పీఎస్ బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు.

పనులు పూర్తయ్యేలా చర్యలు

హస్తినాపురం: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు కనీస వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాలనీల్లో జరుగుతున్న పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలన్నారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

లింగోజిగూడ: లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ఏకైక లక్ష్యమన్నారు. వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు అభిమానులు తరలివచ్చి రాజశేఖర్ రెడ్డితో కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

కథనం ప్రచురితం.. సమస్య పరిష్కారం





కుర్మగూడ బస్తీలో కొనసాగుతున్న పనులు

సాక్షి ఎఫెక్ట్..

చంచల్‌గూడ: ఎరుకలబస్తీ కుర్మగూడలో గత కొన్ని నెలలుగా తాగునీరు కలుషితమై సరఫరా కావడంతో స్థానికులు తాగునీరు లేక ఇబ్బందులు పడేవారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు పలుమార్లు సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.పలుమార్లు పైపులైన్లకు మరమ్మతు పనులు చేపట్టినా మట్టిరంగులో నీరు సరఫరా కావడంతో కనీసం వాడుకునేందుకు కూడా వీలు ఉండేది కాదని స్థానికులు వాపోయేవారు. ఈ క్రమంలో ఆయా బస్తీల్లో కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. కొంత మేర పైపులు వేసి వదిలేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అధికారులను ఆరా తీయగా పైపుల కొరత ఉండటంతో పనులు పూర్తి చేయలేదని సమాధానమిచ్చినట్లు తెలిపారు. ఈ సమస్యపై ఇటీవల 'ఇంకెనాళ్లు..రంగుమారిన నీళ్లు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సంగం వరకు వదిలేసిన పనులను పునఃప్రారంభించి మంగళవారం పూర్తి చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యూ టేస్టీ!

నూతన సంవత్సరం సందర్భంగా బేకరీలు, రెస్టారెంట్లు కొత్త కొత్త ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట్, ఆర్కేపురం, అల్కాపురి, ఎల్‌బీనగర్, సైదాబాద్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాలలో మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు, సంగీతపు హోరు, నోరూరించే విందు భోజనాలకు పలు హోటళ్లు, రెస్టారెంట్లు వేదికగా మారాయి. ఆయా ప్రాంతాల్లోని బేకరీల్లో భిన్నవిభిన్న కేకులను తయారు చేసి పెట్టారు.

– దిల్‌సుఖ్‌నగర్



రమేష్‌గౌడ్ సేవలు మరువలేనివి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఆకుల రమేష్‌గౌడ్ సేవలు మరువలేనివని ఆయన ఆశయాలను కొనసాగిస్తామని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం రమేష్‌గౌడ్ 4వ వర్ధంతి సందర్భంగా యువ నాయకుడు అఖిల్‌గౌడ్ ఆధ్వర్యంలో లింగోజిగూడ లిబర్టీ చౌరస్తాలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి రంగారెడ్డి హాజరై రమేష్‌గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్ అభివృద్ధికి రమేష్‌గౌడ్ ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కొత్త రవిందర్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, రామ్మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

సైలెన్సర్లు మార్చిన 24 మందికి జరిమానా



సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాగోలు: ద్విచక్ర వాహనాలకు భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను బిగించిన వారిపై ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బుల్లెట్లు ఇతర స్పోర్ట్స్ బైక్‌ల సైలెన్సర్లను మార్చి రహదారులపై తిరుగుతున్న 24 మందిని అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించి అక్కడికక్కడే సైలెన్సర్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు కృష్ణ, మధుబాబు, శంకర్, రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు

మన్సూరాబాద్: వ్యర్థాలు, చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దని, ఇళ్ల వద్దకు వచ్చే చెత్త ఆటోకు ఇవ్వాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. హయత్‌నగర్ పరిధి వీరభద్రనగర్‌కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి స్థానికులతో మాట్లాడారు. చెత్తను ఇష్టానుసారంగా పారబోస్తే దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పలు కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని, చెత్తవేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ వెంట కాలనీవాసులు దశరథగౌడ్, విజయేందర్‌రెడ్డి, గాలయ్య, ఎల్లయ్య, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, నరేంద్రరెడ్డి ఉన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో ధనుర్మాస పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దిల్‌సుఖ్‌నగర్: ధనుర్మాసం సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాయలంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తోరణ, గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

పసికందు హత్యకేసులో మహిళకు జీవితఖైదు

రంగారెడ్డి కోర్టులు: రెండు నెలల పసికందుని నీటి ట్యాంకులో పడేసి హత్య చేసిన మహిళకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ జ్యోతిరెడ్డి వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం అనాజ్‌పూర్ గ్రామంలో ఓరుగంటి శ్వేత (23) తన ఆడపడచు కొడుకుని ఇంటి పైనున్న నీళ్ల ట్యాంకులో వేసి హతమార్చింది. నిందితురాలు తన ఆడపడచు మగబిడ్డకు జన్మనిచ్చి పుట్టింటికి రావడంతో తరచూ వారి నడుమ గొడవలు జరిగేవి. ఇదే అక్కసుతో శ్వేత 2021 జూన్ 18 అర్ధరాత్రి పసికందు గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించగా గట్టిగా ఏడవడంతో నీళ్ల ట్యాంకులో వేసి హత్య చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు నిందితురాలిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా 12వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ప్రదీప్ నాయక్ నిందితురాలికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

బాలికపై లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధించారు. కోర్టు ఏపీపీ సునితా బర్ల వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ ఠాణా పరిధిలో నివసించే ఇంటర్ విద్యార్థిని (17)ని ప్రేమ, పెళ్లి అని చెప్పి అదే ప్రాంతానికి చెందిన వరికుప్పల మహేశ్ (24) 2018 నవంబర్ 6న బాలికను ఇంటి నుంచి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి నిందితుడికి జైలుశిక్ష, బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పునిచ్చారు.

4న లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

చాదర్‌ఘాట్: అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 4న మలక్‌పేటలోని బ్రెయిలీ పార్కులో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. వేడుకల్లో అంధులకు అవసరమైన పలు ఉపకరణాలను అందజేస్తామన్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ భాష్యం పాఠశాల 12వ వార్షికోత్సవం సందడిగా జరిగింది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఇస్రో శాటిలైట్ స్టేషన్ ఇంజినీరు గోడి వేంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా భాష్యం విద్యాసంస్థల సీఈఓ చైతన్య మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి విద్యాసంస్థలు, బోధనా సిబ్బందికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన, వందశాతం హాజరు కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల జెడ్‌ఈఓ అంకమ్మరావు, హైస్కూల్ ప్రిన్సిపల్ పల్లవి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపల్ భానుమతి పాల్గొన్నారు.

లిటిల్ ల్యాంబ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లిటిల్ ల్యాంబ్ చర్చిలో సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పాస్టర్ రెవ. డా.కే.సుదర్శన్‌రావు క్రీస్తు సందేశం, బైబిల్ సారాంశాన్ని వినిపించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ క్రిస్టియన్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రేమ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పి.ప్రమోద్‌కుమార్, టీ.ఎస్.బాబూరావు, సురేష్‌కుమార్, ఎస్.జాన్, జార్జి ముల్లర్, ఎలియా, ఎం.బి.రాజు, కిశోర్‌బాబు, యోసేబు, రాజు పాల్గొన్నారు.

నియామకం

వనస్థలిపురం: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ హైదరాబాద్ రీజియన్ అడ్వయిజరీ పానెల్ మెంబర్‌గా హైకోర్టు న్యాయవాది, వనస్థలిపురంకు చెందిన వరకల వీణ నియమితులయ్యారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ నియామకం జరిగింది. మూడేళ్ల పాటు ఆమె పదవిలో కొనసాగుతారు.

యువతి అదృశ్యం



శాలిని

హయత్‌నగర్: డ్యూటీకి వెళ్తున్న చెప్పి బయటికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ అన్మగల్‌కు చెందిన శాలిని(25) వనస్థలిపురంలోని ఓ కళాశాలలో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. రోజు మాదిరిగా సోమవారం డ్యూటీకి వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు కాలేజీకి వెళ్లి ఆరా తీయగా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. సైదాబాద్‌లోని ఎల్‌సీహెచ్ చిన్నకాలనీ, పద్మావతి కల్యాణ మండపం, రెవెన్యూ బోర్డు కాలనీల్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాళ్ల పనులను మంగళవారం ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వామ్యం అయితే నాణ్యతతో పాటు సకాలంలో పూర్తవుతాయన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీవాసులు ఉన్నారు.

మండీలో జేబుదొంగల హల్‌చల్

చంచల్‌గూడ: కూరగాయలు కొనుగోలు కోసం మార్కెట్‌కు వచ్చిన వారి వద్ద జేబు దొంగలు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల కూరగాయలు కొనేందుకు వచ్చిన వ్యక్తి నుంచి దొంగలు రూ. 40 వేలు విలువ చేసే ఫోన్‌ను తస్కరించగా బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొంత కాలం క్రితం ఫోన్‌లు తస్కరిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని మార్కెట్ వ్యాపారులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటనలు ఉన్నాయి. గతంలో మార్కెట్‌లో ఎలాంటి ఘటన, జరిగినా స్టేషన్‌లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యేవి. వేలాది మంది రాకాపోకలు సాగించే రద్దీ ప్రదేశమైన మార్కెట్‌లో వ్యాపారులు కూడా తమ తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకపోవడంతో దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు.